ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 14 జూలై 2025



కక్షిదారుల వద్దకు న్యాయ వ్యవస్థ

- పెండింగ్ కేసుల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం
- హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

7



పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్,సీపీ

ఘనంగా ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

7

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న హైకోర్టు జడ్జిలు



హైకోర్టు జడ్జిలకు స్వాగతం పలుకుతున్న ఈవో, అర్చక బృందం

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌తో పాటు హైకోర్టు జడ్జీలు శ్రావణ్‌కుమార్, వేణుగోపాల్, కార్తీక్, శ్రీనివాసరావు, జిల్లా జడ్జి కుంచాల సునీత హాజరయ్యారు. ఈవోసదయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు రామాలయంలో జడ్జీలు పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం అందించి సన్మానించారు. అలాగే పెద్దపట్నం బ్రహ్మోత్సవాలకు వివిధ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కోరుకున్న మేరకు మొక్కులను సమర్పించారు.

- కేంద్ర మంత్రికి సీఎం వినతి
- అయినా ఆర్ఎఫ్‌సీఎల్‌కు రాని ఆదేశాలు
- పది రోజుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 10వేల టన్నుల రవాణా
- జిల్లాలో అరకొర నిల్వలు

యూరియా కోటా పెంపుపై స్పందించని కేంద్రం



కోల్‌సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత ఏర్పడుతోంది. కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను ముఖ్యమంత్రి కలిసి విజ్ఞప్తి చేసినా ఇప్పటికీ ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్రానికి కోటా పెంపుపై కేంద్రం నుంచి ఆదేశాలు రాలేదు. ఎరువుల కోటాను నిర్దేశించే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్(డీఓఎఫ్) ఈ మేరకు జారీ చేయాల్సి ఉంటుంది. గత సంవత్సరం జూలైలో 60వేల టన్నులు సరఫరా జరిగితే ఈ ఏడాది 30వేల టన్నులకు కుదిరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా వాడకం పెరిగింది. రైతాంగానికి యూరియా నిల్వలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. జూలై మొదటి వారంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా జరిగేది. గత ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 1.14లక్షల టన్నులు రవాణా చేశారు. ఈ ఏడాది ప్లాంట్ షట్‌డౌన్ కావడంతో రెండు నెలలు యూరియా సరఫరాకు ఆటంకం ఏర్పడింది.

ఆర్ఎఫ్‌సీఎల్ ఈనెల కోటా 30వేల టన్నులు నిర్దేశం చగా పది రోజుల్లో 10వేల టన్నులు రవాణా చేశారు. అదనంగా 7వేల టన్నులు కృష్ణపట్నం నుంచి నేషనల్ ఫెర్టిలైజర్స్ కోటాలో రాష్ట్రానికి ఇచ్చారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యుద్ధ ప్రాతిపదికన యూరియా సరఫరా చేసేం దుకు రాష్ట్ర వ్యవసాయశాఖ ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఒక అధి కారిని లైజనింగ్ అధికారిగా నియమించింది. ప్లాంట్ నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేస్తున్నారు. ఒక్కో రేక్‌లో 2600 టన్నుల నుంచి 3వేల టన్నులు రవాణా జరుగుతుంది. నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి ప్రాంతాలకు యూరియా రవాణాకు రేకుల కొరత ఏర్పడుతుంది. ఒక్కో రేక్ లోడ్ అయ్యేందుకు 12గంటల సమయం తీసుకుంటుంది. కామారెడ్డి రైల్వే లైన్ సిం గిల్ లైన్ కావడంతో యూరియా సరఫరాను దృష్టిలో ఉంచుకుని ఇతర రవాణాను రైల్వేశాఖ కుదించుకుంది. అయినా రేకుల కొరత తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2.2లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నట్టు (మిగతా 8వ పేజీలో)

● జిల్లాలో నిల్వలు ఇలా...

పెద్దపల్లి జిల్లాలో సైతం యూరియా నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. సాధారణంగా ఈ సీజన్‌లో 20వేల టన్నులు నిల్వ ఉండాల్సి ఉండగా 6వేల టన్ను లు మాత్రమే నిల్వ ఉన్నట్టు తెలుస్తున్నది. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు చేరకపోవడంతో వరినాట్లు మొదలు కాలేదు. కేవలం వాణిజ్య పంటలకు మాత్రమే యూరియా డిమాండ్ ఎక్కువగా ఉంది. వరినాట్లు మొదలైతే జిల్లాలో యూరి యా డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యవ సాయశాఖ జిల్లాకు అవసరమైన యూరియాను అం దించలేదు. గతంలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆర్ఎఫ్ సీఎల్ నుంచి నేరుగా కోటా విడుదల చేయించారు. ఈ సారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. యూరియా ఉత్పత్తి, రవాణాలను రోజు కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ మానిటర్ చేయడమే కాకుండా తమ ఆదేశాలు లేనిది ఎవరికి అదనపు కేటాయింపులు జరుపవద్దంటూ స్పష్ట మైన ఆదేశాలు ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో కూడా యూరియా ఇక్కట్లు అనివార్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఊరూరా బోనాల జాతర



పెద్దపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తెనుగువాడలో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆషాఢమాసం ఆదివారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ముదిరాజ్ సంఘం బాధ్యులు పోచమ్మ తల్లికి బోనం సమర్పించిన అనంతరం ఆదివారం జరిగిన పెద్దమ్మ తల్లి బోనాల వేడుకల్లో ముదిరాజులు అధిక సంఖ్యలో పాల్గొని తల్లి దీవెనలను కోరారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివెళ్లారు. గుడి చుట్టు ప్రదక్షిణలు చేసి, బోనాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్లు, ముదిరాజ్ సంఘం సభ్యులు, కులస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంథనిలో బోనాలతో మహిళలు



ఎలిగేడులో బోనాలతో వెళుతున్న మహిళలు

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గౌతం గోవర్ధన్

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా మహాసభలను విజయవంతంచేయాలని జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్జీ-2 ఏఐటీయూసీ ఆఫీస్‌లో జరిగిన కమాన్‌పూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ మహాసభలు నిర్వహించి, పార్టీ బలోపేతం దిశగా జాతీయ నాయకత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలి పారు. దీనిలో భాగంగా ఈనెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభకు సింగరేణి కార్మికులు, కమాన్‌పూర్ మండలం, రామగుండం కార్పొరేషన్ కార్యకర్తలు హాజరు కావాలని గౌతంగోవర్ధన్ సూచిచాఆరు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి రాజారత్నం, ఎల్ ప్రకాష్, జిగురు రవీందర్, బుర్ర తిరుపతి, కొండ్ర సత్యనారాయణ, కొంకటి రాజయ్య పాల్గొన్నారు.

తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చందర్, హరి

పాలకుర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. గ్రామాల్లో ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 20 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలు అమలు చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున రైతు భరోసా పథకాన్ని అమలు చేశారని తెలిపారు. రైతుబంధు పథకాన్ని కేసీఆర్ నాట్లు వేసే సమయంలో ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల సమయంలో ఇస్తుందన్నారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేసి ఇప్పటి వరకు చేసింది ఏమిటని ప్రశ్నించారు. పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో గ్రామ బాట కార్యక్రమం చేపట్టి గ్రామ ప్రజలకు కాంగ్రెస్ వైఫల్యాలను వివరి స్తామని తెలిపారు. గ్రామబాట కార్యక్ర మాన్ని సోమవారం ఈసాలతక్కళ్లపల్లి నుంచి ప్రారంభిస్తామని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం నిత్యం తప్పించే మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మంథని ప్రజలు ఆదరించడం వల్లనే శ్రీధర్‌బాబు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎమ్మెల్యే, విప్‌గా పని చేశారని, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. శ్రీనుబాబు ప్రతి గ్రామంలో ప్రజలకు సేవ చేయడంతో పాటు వారికి ఏ సమస్య వచ్చినా వెంట నిలబడుతున్నా డన్నారు. పుట్ట మధుకు రాజకీయ బిక్ష పెట్టింది శ్రీపాదరావు అనే విషయం మరిచి పోవద్దన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ డిక్లరేషన్ చేస్తే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జీర్ణించుకోవడం లేదని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు బీసీలకు చేసిందేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కొత్త నాటకానికి తెరలేపిందంటూ చందర్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

కాంగ్రెస్ నాయకులు మహం కాళి స్వామి, కాల్వ లింగస్వామి, సుతారి లక్ష్మణ్‌బాబు, గట్ల రమేష్, తాళ్లపల్లి యుగంధర్, ముస్తాఫా, చొప్పరి శ్రీనివాస్, దొంతుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డిలు ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావ డంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు వారు తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లు ఉండాల్సి ఉండగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 శాతానికి తగ్గించినప్పుడు చందర్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్‌కు ఎటువంటి విధివిధానాలు లేవని తెలిపారు. కాంగ్రెస్ అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, కోరుకంటి చందర్ అనవసర విమర్శలు మానుకోవాలని రాజేష్, రాజిరెడ్డిలు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మట్టి దోపిడీ

- తగ్గిన ఇసుక ధర... పెరిగిన మట్టి ధర
- పేదలను దోచుకుంటున్న మట్టి మాఫియా

ఎలిగేడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇళ్ల లేని నిరుపేదలకు నీడ కలిపించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తే కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పుకొని మట్టిదోపిడీకి పాల్పడుతున్నారు. ఇదే అదనుగా దొరికినంత మట్టిని అమ్ముకుంటూ దోచుకుంటున్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు లాభం చేకూరేలా ఇసుక ధర రూ.3 వేల నుంచి రూ.1200 వరకు తగ్గడంతోపాటు ఇటుకను పేదలకు అందుబాటులో ఉండేలా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషి చేస్తున్నారు. పేదలకు లబ్ధి చేకూరేందుకు అహర్నిశలు పాటుపడుతుంటే మండలంలోని పలు గ్రామాల్లో కొం దరు అధికారి పార్టీ నాయకులకు మట్టి దందా వరంగా మారింది. అధికారుల కళ్లు గప్పి విచ్చలవిడిగా రాత్రింబవళ్లు మట్టి సరఫరా చేస్తూ అధిక దరలకు విక్రయిస్తున్నారు. గతంలో ఒక కాంట్రాక్టర్ ట్రాక్టర్ ట్రిపు రూ.400లకు సరఫరా చేయగా, ప్రస్తుతం రూ.700 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విధంగా ఒక పేద కుటుంబం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే ఆ ఇంటికి 50 నుంచి 60 ట్రిప్పుల మట్టి అవసరం పడితే దీనికి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. దీంతో పేదవానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కలగానే మిగిలి పోతుందని, అప్పుతెచ్చి చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. మండలంలో పలు చోట్ల 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి ఒక ట్రిపు ఇసుక సరఫరాకు రూ.1200 అయితే, పట్టుమని 2 కిలోమీటర్ల దూరంలో లేని మట్టి తరలింపునకు రూ.800 వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న మట్టి కోసం నిర్ణీత ధరను నిర్ణయించి మట్టి మాఫియా దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మట్టి తోడుతున్న ఎక్స్‌కావేటర్

పరిషత్ ఎన్నికలపై దృష్టి

- ప్రణాళిక రూపొందిస్తున్న కాంగ్రెస్
- 16న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ రాక
- ఇందిరా గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం
- డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు ఆహ్వానం

6

రైస్‌మిల్లులపై నిఘా ఏదీ?

- సీఎంఆర్ ధాన్యం పేరిట భారీ కుంభకోణం
- ఏళ్లుగా బాకీ పడిన మిల్లర్లు
- పట్టించుకోని అధికారులు
- ఎఫ్‌సీఐ నివేదికలు పట్టించుకోని ప్రభుత్వం
- నలభై మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం సున్నా



సుల్తానాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల్లో వందల కోట్ల ధాన్యం కుంభకోణం వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో రెండు వందలకు పైగా రైస్‌మిల్లులు ఉన్నాయి. అన్ని మిల్లుకు కస్టం మిల్లింగ్ కోసం ప్రతీ వ్యవసాయ సీజన్‌లో ఐదు నుంచి పది కోట్ల రూపాయల విలువ గల ధాన్యం ప్రభుత్వం అప్పగిస్తుంది. తిరిగి వాటిని బియ్యం రూపకంగా ప్రభుత్వానికి చెల్లించడం లేదు. ఒక్కోక్క మిల్లుకు ఐదు వందల లారీల ధాన్యాన్ని అప్పగిస్తే వాటిపై అధికారులు నిఘా పెట్టడం లేదు. రెండు సంవత్సరాల నుంచి కూడా సీఎంఆర్ బాపతు బియ్యం మిల్లర్లు బాకీ పడ్డారు. కఠినచర్యలు తీసుకోకుండా అప్పుడ ప్పుడు నోటీసులు ఇస్తూ అధికారులు చేతులు దులుపుకుం టున్నారు. ఎఫ్‌సీఐ అధికారులు మిల్లులో స్పాట్ ఫెరిఫికేషన్ పేరిట తనిఖీలు చేసి మిల్లుల్లో నిల్వలు లేని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెలుతారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మిల్లులకు రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు కూడా అప్పుడపుడు మిల్లులను తనిఖీ చేస్తారు. మిల్లర్లు అధికారులను మేనేజ్ చేస్తున్నారు. మిల్లులకు ప్రభు త్వం అందిస్తున్న కోట్లాది రూపాయల ధాన్యాన్ని సొమ్ము చేసుకుంటున్న మిల్లర్లు ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. బినామీల పేరిట ఆస్తులు సమకూర్చుకుంటున్నారు. సీఎంఆర్ బియ్యం బాకీ ఉన్నా కూడా ఈ సీజన్‌లో వారికి వందల లారీల ధాన్యాన్ని మళ్ళీ అప్పగించారు.

● కేటాయింపులు ఒక చోట మిల్లింగ్ మరో చోట

మిల్లర్లు కొత్త కొత్త ఎత్తులు వేస్తూ అక్రమార్కులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఒక మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని సదరు మిల్లర్లు వారి మిల్లులో కాకుండా ఇతర డిఫార్టర్లకు వాటిని విక్రయిస్తున్నారు. బియ్యం బాకీ పడ్డ మిల్లులకు వాటిని పంపించి సదరు మిల్లు సీఎంఆర్ కోటాను పూర్తి చేసేందుకు సహకరించుకుంటున్నారు. కొందరికి రెండు నుంచి ఐదారు మిల్లులు ఉన్నాయి. అందులో కొన్ని బ్లాక్‌లిస్టులో ఉండి ధాన్యం కేటాయింపులకు కూడా నోచుకోవు. అలాంటి మిల్లులకు సైతం ధాన్యం దర్జాగా వెలుతుంది.

● దళారుల దందా

సుల్తానాబాద్‌లో ధాన్యం, బియ్యం దళారుల హవా నడుస్తుంది. ధాన్యం అమ్మలన్నా, లారీల కొద్ది బియ్యాన్ని సమకూర్చాలన్నా గంటల్లో పని పూర్తి చేరస్తున్నారు. ఉమ్మడి జిల్లాల్లోనే బాయిల్డ్ రైస్ మిల్లర్ల పెత్తనం ఉండేది. పెద్ద ఎత్తున బియ్యం కోటాను, ధాన్యం కేటాయింపులు చేసుకునేవారు. ఇటీవల రా రైస్‌మిల్లర్లు ఒకటయ్యారు. వీరిలో కొందరు సీఎంఆర్ ధాన్యం దందాకు శ్రీకారం చుట్టారు. గతంలో పీడీఎస్ దందా చేసిన దళారులు ఇపుడు బియ్యం లారీలను సమకూర్చే బ్రోకర్లుగా మారారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని సీఎంఆర్ ధాన్యం నిలువలు రికవరీ చేయాల్సి ఉంది.

● నాడు పీడీఎస్..నేడు సీఎంఆర్

సుల్తానాబాద్ కేంద్రంగా రైస్‌మిల్లుల్లో గతంలో పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ దందా జోరుగా సాగింది. రీ సైక్లింగ్ చేసిన పీడీఎస్ బియ్యంను తిరిగి ప్రభుత్వ గోదాములకు పంపించి అక్రమార్జనకు పాల్పడ్డ ఘటనలు అనేకం ఉన్నా యి. అధికారులు పట్టుకున్నప్పుడు కేవలం 6ఏ కేసులకు మాత్రమే పరిమితమయ్యాయి. ప్రస్తుతం సీఎంఆర్ దాన్యం కుంభకోణానికి సుల్తానాబాద్ కేంద్రంగా మారింది. ఈ ప్రాంతానికి చెందిన సీఎంఆర్ బాపతు ధాన్యాన్ని మిల్లర్లు పలు జిల్లాలకు తరలిస్తున్నారు. ఈ దందా కొన్నేళ్ళుగా నడుస్తున్నా ఇటీవల హైదరాబాద్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి గుట్టురట్టు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

గంభీరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బండారి బాలమల్లుపై బండరాయితో దాడిచేసి, గాయపర్చిన సంఘటనలో అదేగ్రామానికి చెందిన నర్ర మల్లేశం, నర్ర అజయ్, నర్ర యాదవ్వలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాలమల్లు 35ఏళ్లగా సాగు చేసుకుంటున్న వ్యవసాయపొలంలోకి ఈ నెల 12న నర్ర మల్లేశం, అతని కొడుకు అజయ్, భార్య యాదవ్వలు వచ్చి తమ పొలం అంటూ దూషిస్తూ దాడి చేశారని ఎస్‌ఐ తెలిపారు. బాలమల్లును నెట్టివేస్తూ ముగ్గురు బండరాయితో దాడిచేయగా తలకు, కుడిచేతికి గాయమైందన్నారు. దాడి సమయంలో అడ్డువెళ్లినబాలమల్లు తండ్రికి, అన్నకుకూడా గాయాలైనట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్ర మల్లేశం, అజయ్, యాదవ్వపై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఒకరిపై కేసు

మల్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నూకపల్లి డబుల్‌బెడ్‌రూం కాలనీలో ఒకరిపై దాడిచేసిన షేక్ హంజ అలియాస్ అయాన్ అనేవ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. షేక్ రహాన్‌ను పాతగొడవల నేపథ్యంలో శనివారం రాత్రి అదేకాలనీకి చెందిన షేక్ హంజ అలియాస్ అయాన్ తనమిత్రులతో కలిసి దాడిచేయగా గాయాలు అయినట్లు ఎస్సై తెలిపారు. దీంతో రహాన్‌తల్లి రజీయాబేగం ఫిర్యాదుమేరకు షేక్ హంజ అలియాస్ అయాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరిషత్ ఎన్నికలపై దృష్టి

- ప్రణాళిక రూపొందిస్తున్న కాంగ్రెస్
- 16న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ రాక
- ఇందిరా గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం
- డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు ఆహ్వానం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపడం అనివార్యం కావడంతో కాం గ్రెస్ పార్టీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. స్థానిక సంస్థల్లో పట్టు సాధిం చడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతిని ధు లను పెంచుకుని వారి ద్వారా అసెంబ్లీ ఎన్ని కల్లో తిరిగి ఘన విజయం సాధించాలని ఆ పార్టీ భావిస్తున్నది. గ్రామీణ స్థాయిలో సంస్థా గత నిర్మాణం, స్థానిక సంస్థల్లో ప్రతి నిధులను గెలిపించుకోవడం లక్ష్యంగా ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహరచనలు చేస్తున్నది.

● కమిటీల నియామకానికి చర్యలు

ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జి లను నియమించింది. పార్లమెంట్ నియోజ కవర్గాల వారీగా సమన్వయకర్తలుగా, వారితో కలిసి పనిచేసేందుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున ప్రతినిధులుగా పార్టీ రాష్ట్ర కమిటీ ఉపా ధ్యక్షులను, ప్రధాన కార్య దర్శులను ప్రకటించింది. స్థానికంగా ఉండే డీసీసీ అధ్యక్షులతో కలిసి పార్టీ నేతలు సంస్థాగతంగా అన్ని కమిటీల నియామ కానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్ఠం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నేతలను గెలిపించ డానికి కార్యాచరణ రూపొందించనున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయ మైన ఇందిరాభవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఈ నెల 16న సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయన ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను కలిసి జిల్లాలో సంస్థాగత పరిస్థితులపై చర్చించారు. 16న ఉమ్మడి జిల్లా పరిధిలోని డీసీసీ అధ్యక్షులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, ఆయా స్థానాలకు పోటీ చేసి ఓడిపోయి ఇన్‌చా ర్జిలుగా ఉన్న నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ, డీసీసీ కార్యవర్గ సభ్యులు, ఇతర నాయకులకు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానాలు పంపించారు. సమావేశంలో ప్రస్తుతం జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై చర్చిస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను గెల్చుకున్నాం, ఇప్పుడు మెజార్టీ స్థానాలను గెలుపొందడానికి ఏం చేయాలి అనే విషయాలపై వారు చర్చించనున్నారని సమాచారం.

● బీసీ రిజర్వేషన్లే ప్రధాన ప్రచార అస్త్రం

ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మల్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ అంశాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనుకుంటున్నారు. నియోజకవర్గానికి 3500 చొప్పున నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజల్లో ప్రచారంచేసి త్వరలోనే రెండో విడత ఇళ్ల మంజూరు జరుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఈ అంశాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయమేమిటి, మరింత సానుకూలత పెంచడానికి ఏ చర్యలు చేపట్టాలి, వాటిని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఏ రకంగా వ్యూహం రూపొందించాలి అన్న విషయమై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 నెలలు కాగా ప్రజల్లో ప్రభుత్వంపట్ల అసంతృప్తి పెరిగిపోయిందని ప్రచారం జరుగుతోంది. దానిని తిప్పికొట్టాలని, ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే కారణాలు తెలుసుకుని సరిచేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ముందుగానేస్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు ఇతర పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది.

ఓసీపీ-3లో ప్రమాదం



ప్రమాదంలో గాయపడ్డ శ్రావణ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆదివారం జరిగిన ప్రమాదంలో గొట్టె శ్రావణ్ అనేకార్మికుడు గాయపడ్డాడు. బ్రేకులు ఫెయిల్‌అయిన డీజిల్‌బోజర్ మరమ్మతు సమయంలో ప్రమాదం జరిగింది. మిడిల్ షిఫ్టులో జనరల్ మజ్దూర్ అయిన శ్రావణ్ డీజిల్ బోజర్ టైర్ల కింది భాగంలో ఎయిర్‌కనక్షన్ సరిచేస్తుండగా బోజర్ ముందుకు కదిలింది. వాహనం శ్రావణ్ మీద నుంచి కదలడంతో తలకు, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అధికారులు హుటాహుటిన శ్రావణ్‌ను స్థానికడిస్పెన్సరీకి తరలించి ప్రథమచికిత్స అనంతరం గోదావరిఖని ఏరియాఆసుపత్రికి తరలించారు. టీబీజీకేఎస్ నాయకులు డిస్పెన్సరీలో శ్రావణ్‌ను పరామర్శించారు. ఇటీవల ఓసీపీ-3లో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు రక్షణపై దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ-2వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి జీపీ ఉద్యోగి మృతి



సమ్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బల్బు పెట్టేందుకు ప్రయత్నించి గ్రామపంచాయతీ ఉద్యోగిమృతి చెందిన సంఘటన మండలంలోని తారుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపినవివరాల మేరకు అమిదాలసమ్మయ్య(54) గ్రామపంచాయతీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అంగడి కావడంతో అక్కడే ఉన్న హనుమాన్ గుడిపక్కన ఉన్న కరెంటు పోలుకు విద్యుత్ బల్బుపెట్టేందుకు ప్రయత్నించాడు. ప్రమాదశాత్తు జారిపడటంతో సమ్మయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎండి భరన్ అనేవ్యక్తి డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన జాబితాలో తన పేరు లేదని ఆవేదన చెంది ఆదివారం గ్రామశివారులో పురుగుల మందు డబ్బాను చూపిస్తూ ఆత్మహత్య చేసుకుంటున్నానని మిత్రులకు వీడియో కాల్ చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు, మిత్రులు అక్కడికి చేరుకుని బుజ్జగించి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త కావడంతో ఈ విషయం మండలంలో చర్చనీయంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెటపల్లిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జరపు నిఖిల్ (26) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా నిఖిల్ అనే వ్యక్తి ఎగిరి పడి అటుగా వస్తున్న ట్రాక్టర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కాగా స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఆపకుండా అతివేగంగా వెళ్లి పోయాడని స్థానికులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొన్నం రవిచంద్రకు హైమా అవార్డు

కరీంనగర్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్, కఫిసొ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర హైమా అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.



హైమా అవార్డు అందుకుంటున్న పొన్నం రవిచంద్ర

మట్టి, ఇసుకను అక్రమంగా
రవాణా చేస్తే కఠిన చర్యలు

- మట్టి తరలిస్తున్న 10 వాహనాలు సీజ్
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వేములవాడ రూరల్ మండలం కొడుముంజ, అనుపురం గ్రామ పరిసరాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 10మట్టి తవ్వేయంత్రాలు, మట్టి తరలించే వాహనాలను ఆర్డీవో రాధాబాయి సీజ్ చేశారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్నట్లు బ్యానర్‌తో అక్రమంగా తరలిస్తున్న 4 టిప్పర్‌లు, 2 ట్రాక్టర్‌లు, 2 జేసీబీలు, 2 హిటాచి యంత్రాలను సీజ్‌చేసి వారిపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమలు తేకుండా మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

శ్రావణ్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విలపిస్తున్న శ్రావణ్ కుటుంబ సభ్యులు

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కడారి శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. కరీంనగర్ మహిళా రాణా సీఐతోపాటు శ్రావణ్‌కుమార్ భార్య తరపున బంధువుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీ గది ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకునేవరకు పోస్టుమార్టం నిర్వహించ వద్దని భీష్మించారు. శ్రావణ్‌కుమార్ సోదరి వనజ మీడియాతో మాట్లాడుతూ శ్రావణ్‌కుమార్‌పై అతడి భార్య నీలిమ వరకట్నం వేధింపుల కేసు పెట్టిందని, ఈ క్రమంలో శ్రావణ్‌కుమార్‌ను కరీంనగర్ మహిళా రాణా సీఐ బెదిరించాడని ఆరోపించారు. దీంతో ఈనెల7న పురుగుల మందుతాగాడని, ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. శ్రావణ్ కుమార్ తండ్రి ఫిర్యాదుతో చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేశారు.

● భార్యాభర్తలం విడాకుల కోసం మ్యూచ్‌వల్‌గా సంతకాలు పెట్టి అంగీకరించిన తరువాత తనపై అక్రమంగా వరకట్నం వేధింపుల కేసు నమోదు చేయడమేమిటని శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు ముందు ఒక సెల్ఫీవీడియోలో ఆరోపించాడు. తన చావుకు సీఐ, తన భార్య నీలిమతోపాటు ఆమె బంధువులు ప్రవీన్, నవీన్, ప్రసన్నవినోద్, మధు కారణమని పేర్కొన్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డిప్రకటనలో తెలిపారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన గజ్జెలరమేష్‌పై కేసునమోదు చేసినట్లుపేర్కొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ ఆదివారం తెలిపారు. జమ్మికుంట మండలంలోని వావిలాల మానేరుపరివాహక ప్రాంతంనుంచి ఎలాంటి అనుమతులులేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు.

మేడిపల్లిలో కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



మల్లిఖార్జున్‌గౌడ్(ఫైల్)

జ్యోతినగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేడిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సింగం మల్లిఖార్జున్‌గౌడ్(40) అనే సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి ఎన్‌టీపీసీ పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్ల ఘర్షణ

మంథని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామంలో గల ఇసుక క్వారీ వద్ద లారీడ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక, నాన్‌లోకల్ డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. స్థానికులకు మొదట ప్రాధాన్యమిచ్చి లారీలను లోడ్ చేయాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా నాన్ లోకల్ సైతం లోడింగ్ చేయాలని ఆందోళన చేయడంతో ఇరుపక్షాల మధ్య వాదనలు పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. లారీడ్రైవర్లు లారీలు నిలిపి ధర్నా నిర్వహించారు. మంథనిఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరుపక్షాలను శాంతింపచేశారు. నిర్వాహకులు ప్రస్తుతానికి ఇసుక క్వారీని తాత్కాలికంగా మూసివేశారు.

విద్యుత్ వైరు తగిలి గేదె మృతి

గన్నేరువరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఆదివారం విద్యుత్ ఎల్‌టి లైన్ వైరు తెగిపడి ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మాంకాళి కిష్టయ్యకు చెందిన గేదె వాగు సమీపంలోని వ్యవసాయభూమిలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా ఎల్‌టి లైన్ వైరు తెగిగేదెపై పడడంతో మృతి చెందిందన్నారు.

గేదె విలువ సుమారు 60వేలు ఉంటుందని విద్యుత్ అధికారులు నష్టంపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరాడు.

నారుమడిని కాపాడుకోవడానికి..

- బిందెలతో నీళ్లు పడుతున్న రైతులు
- మూడు రోజుల క్రితం కాలిన ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

గొల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో నారుమడులకు నీరందడం లేదు. అటు వర్షాలు కురవక, ఇటు విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో నారుమడులను కాపాడుకునేందుకు పలువురు రైతులు బిందెలతో నారు మడులకు నీళ్ల పోస్తూ నానాపాట్లు పడుతున్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మూడురోజుల క్రితం కాలిపోయింది. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు సమాచార మందించినా మరమ్మతులు చేపట్టలేదు. సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ద్వారా 25మంది రైతుల వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని బాధితరైతులు కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ మధును వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



రంగదామునిపల్లిలో బిందెలతో నారు మడికి నీరు పోస్తున్న మహిళా రైతులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొడిమ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెప్యాల గ్రామానికి చెందిన ఊటుకూరి అభిజిత్ అనే యువకుడు గాయాల పాలైనట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. అభిజిత్ చెప్యాల గ్రామం వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురెదురుగా ద్విచక్ర వాహనం కారు ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికునికి గాయాలయ్యాయి. మండలంలోని పెగడపల్లి గ్రామానికిచెందిన గోపగోని రాజమల్లు ఆదివారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని కాళ్లు, చేతులు, తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం పెద్దపల్లికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటగ్రామ శివారులోని వడ్లవానికుంట సమీపంలో నుంచి మట్టిని తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఆదివారం కట్టపై నుంచి అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించికిందకు దూకేశాడు. దాంతో ప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది. మట్టిని రవాణా చేస్తున్న వాహనం అదుపు తప్పి కట్టపై నుంచి ట్రాక్టర్‌ఇంజన్ బోల్తాకొట్టింది. సమాచారం అందుకున్న రైతులు ఎక్స్‌కవేటర్‌తో బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించారు.

నట్టల నివారణ మందులేవి?

- రెండేళ్లుగా పంపిణీ చేయని ప్రభుత్వం



కరీంనగర్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులను తాగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రెండు సార్లు నట్టల నివారణ మందులను పంపిణీ చేపటేది. ఇప్పటికి రెండేళ్లగా పంపిణీ చేయకపోవడంతో గొర్రెల, మేకల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వారు తెలుపుతున్నారు. రెండేళ్లగా గొర్రెలకు మేకలకు ప్రభుత్వం నట్టల నివారణ మందుల సరఫరా చేయడం లేదు. సకాలంలో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల జీవాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని, బరువు పెరగుతాయని పశువైద్యులు చెబుతున్నారు. బరువు పెరిగిన గొర్రెలు, మేకలను విక్రయిస్తే పెంపకం దారులకు లాభదాయకంగా ఉంటుంది. కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 4,500 వరకు మేకలు, 35 వేల వరకు గొర్రెలు ఉన్నాయి. గతంలో ప్రతి యేడు రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను పశు వైద్యశాఖ ద్వారా అందించేది. రెండేళ్లగా నిలిచిపో యింది. దీంతో గొర్రెలు సరిగా పెరగక, విక్రయాలు సరిగ్గాలేక నష్టపొతున్నా మని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేయకపో వడంతో సొంత డబ్బుతో నట్టల నివారణ మందు వేయిస్తున్నామని మరి కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈనెలలో పశువులకు రోగాల బారిన పడకుండా మాత్రం టీకాలు వేశామని పశు వైద్యాధికారులు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నట్టల నివారణ మందులను అందించాలని గొర్రెల పెంపకం దారులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

నిమ్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా, నాగారం ధర్మపురికి చెందిన అరుణ్ కుమార్ (61) తలకు సర్జరీ కోసం జూన్19న నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు చేరాడు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న అరుణ్ కుమార్ ఆదివారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తొందరగా మృతదేహాన్ని వారి సొంతూరుకు పంపాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ట్రై బల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, అదనపుడైరెక్టర్ సర్వేశ్వరరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ఉన్నారు.

తండ్రీకొడుకుల మధ్య భూవివాదం

- పురుగుల మందు తాగి కొడుకు మృతి

జూలపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలకేంద్రానికి చెందిన గుమ్మడి సతీష్(35) అనేవ్యక్తి భూమి వివాదంలో తీవ్ర మనస్తాపానికి లోనై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గుమ్మడి మల్లయ్యకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.అందరికీ వివాహలయ్యాయి. మల్లయ్యకు 30గుంటల వ్యవసాయ భూమి ఉంది. భూమిపంపకం విషయంలో తండ్రి మల్లయ్య, కొడుకు సతీష్ మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం తండ్రీకొడుకు మధ్య గొడవ జరగగా మనస్తాపానికి గురైనసతీష్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేక్రమంలోమృతిచెందాడు. సతీష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతి, రాజరాజేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

రాజన్న సేవలో పరకాల ఎమ్మెల్యే..

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఈవో..

దేవదాయ ధర్మదాయశాఖ ఆదేశాలతో వేములవాడ మున్సిపల్ పరిధిలోని గురువయ్యనగర్ సమీపంలో ఆలయఈవో రాధాబాయి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి సబంధించిన స్థలంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెగని సరిహద్దు వివాదం

- గతంలో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన గొల్లపల్లి ప్రజలు
- సమస్య పరిష్కారం కాకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న వెంకట్రావుపల్లె ప్రజలు



ఇల్లంతకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పునర్విభజనతో రెండు గ్రామాల్లో విభేదాలు పొడచూపాయి. సరిహద్దు విషయంలో ఇరుగ్రామాల మధ్య వివాదం ఏడు సంవత్సరాలు గడిచినా పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రావడంతో సరిహద్దు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గొల్లపల్లి, వెంకట్రావుపల్లె గ్రామాలు గతంలో 1600జనాభా, 930 ఓటర్లతో ఏకైక గ్రామపంచాయతీగా ఉండేది. ప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో గొల్లపల్లి గ్రామ పంచాయతీని వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అధికారుల నిర్ణయం వల్ల గొల్లపల్లి గ్రామంలోని ఓటర్లు, భూములను వెంకట్రావుపల్లె గ్రామంలో కలిపారు. దీనిని గొల్లపల్లి గ్రామస్థులు వ్యతిరేకించారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో రెండు గ్రామాల్లో తొలుత ఎన్నికల వాతావరణం నెలకొంది. తమకు జరిగిన నష్టంపై ఏకమైన గొల్లపల్లి గ్రామస్థులు నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. దీనితో గొల్లపల్లి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి పరిపాలన కొనసాగింది. కొంతకాలానికి ప్రభుత్వం మరోసారి గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అధికారులు చాకచక్యంగా వ్యవహరించి కొంతమందితో నామినేషన్లు వేయించారు. తిరిగి ఏకమైన గ్రామస్థులు నామినేషన్లు వేసిన వారందరు ఉపసంహరించుకున్నారు. ఐదు సంవత్సరాల పాటు స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా కొనసాగింది. స్పందించిన అధికారులు సరిహద్దు వివాదాన్ని పరిష్కరిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై వెంకట్రావుపల్లె గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమగ్ర సర్వే జరుపగా వెంకట్రావుపల్లె గ్రామస్థులు బహిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిడిల మేరకు రెండవసారి సర్వేలో పాల్గొన్నారు.



మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావుపల్లె గ్రామస్తులు

తమ గ్రామానికి చెందిన బస్టాండ్, పాలకేంద్రం, పోచమ్మ, పాఠశాలతో పాటు 30ఇళ్ళు, వ్యవసాయ భూములను గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారని పేర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయితేనే ఎన్నికల్లో పాల్గొంటామని, లేనట్లయితే ఎన్నికల బహిష్కరిస్తామని పేర్కొంటున్నారు. గొల్లపల్లి గ్రామస్థులు మాత్రం ఎన్నికల్లో పాల్గొంటామంటున్నారు. సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరించుకోవాలి తప్ప ఎన్నికలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదని అధికారులు పేర్కొంటున్నారు.

సర్పంచ్ ఎన్నికలలో పాల్గొంటాం..

- ఒరుపుల రాములుయాదవ్, గొల్లపల్లి



రాబోవు సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలలో గ్రామస్థులం పాల్గొంటాం. గతంలో మా గ్రామానికి చెందిన ఓటర్లను వెంకట్రావుపల్లె గ్రామంలో కలపడం వల్ల ఎన్నికలను బహిష్కరించాం. అధికారులు ఎంత ఒత్తిడి చేసినా గ్రామస్తులందరం ఒకే మాటకు కట్టుబడి ఉన్నాం. గ్రామపంచాయతీకి పాలకవర్గం లేకపోవడం వల్ల అన్ని రంగాలలో వెనుకబడిపోయాం. ప్రత్యేకాధికారి ఉన్నప్పటికిని ప్రజలకు మేలు జరగలేదు. మా గ్రామానికి దక్కవలసిన ప్రాధాన్యం ప్రస్తుతం లభించింది.

సమస్యలు పరిష్కరిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

- అనగోని యాదగిరిగౌడ్, వెంకట్రావుపల్లె



అధికారులు రెండవసారి ఇచ్చిన సరిహద్దు నోటిఫికేషన్ ఏకపక్షంగా ఇచ్చారు. దీని ద్వారా వెంకట్రావుపల్లెకు చెందిన బస్టాండ్, పోచమ్మ ఆలయం, పాలకేంద్రంతో పాటు దసరా పండుగ రోజు జరుపుకునే జంబి ప్రాంతం కూడా పోతుంది. సమస్యలు పరిష్కరించాలని సమగ్ర సర్వేను బహిష్కరించాం. నాయకులు, అధికారుల హామీతో రెండవసారి సర్వేలో పాల్గొన్నాం. మా గ్రామానికి రావలసిన ప్రాంతాలు రాకపోతే ఎన్నికలకు బహిష్కరించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయం.

ఇరుగ్రామాల మధ్య సమన్వయం కుదర్చాలి

- మంద సుశీల, గొల్లపల్లి మాజీ సర్పంచ్



అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా రెండు గ్రామాల ప్రజల మధ్య సమన్వయం కుదర్చాలి. ప్రస్తుత నిర్ణయం వెంకట్రావుపల్లె గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అన్నదమ్ములుగా కలిసి ఉన్నాం. ఎమ్మెల్యే, జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే బాగుంటుంది. ప్రజల మనోభావాలను ప్రతి ఒక్కరు గౌరవించాలి. సరిహద్దు సమస్య పరిష్కారం అయితే ఇరుగ్రామాల ప్రజలు సంతోషంగా ఉంటారు.

'కోట' మృతితో కలత చెందిన కళాకారులు

- ఉమ్మడి జిల్లాతో కోట శ్రీనివాస్‌కు అనుబంధం



కోట శ్రీనివాసరావు 75వ జన్మదినం సందర్భంగా కళాభారతిలో ఘన సన్మానం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాస్ మరణ వార్త ఉమ్మడిజిల్లాలోని ఆయన అభిమానులు, కళాకారులను కలిచివేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కరీంనగర్‌లో మన సమైక్యత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో జూలై 11, 2018లో కోట శ్రీనివాస్ 75వ జన్మదిన వేడుకలను సంస్థ అధ్యక్షుడు రొడ్డ యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ వారి 'బాపూ చెప్పిన మాట' సాంఘిక నాటికను తిలకించిన ఆయన నటీనటులను అభినందించారు. కార్యక్రమానికి ఆయన సోదరుడు కోట శంకర్‌రావుతోపాటు నటుడు బాబూమోహన్ పాల్గొన్నారు. 2009శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారానికి వచ్చారు. వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గంలో పోటీచేసిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు గెలుపు కోసం రోడ్‌షోలు, ఎన్నికల సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఆయన మృతిపై రొడ్డ యాదగిరి, కృపాదానం, విగోపాల్‌రావు, కనకం రమణయ్య, మాడిశెట్టి గోపాల్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కక్షిదారుల వద్దకు న్యాయవ్యవస్థ

- పెండింగ్ కేసుల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం
- హైకోర్టు జడ్జి జస్టిస్ కె లక్ష్మణ్



ఓదెల కోర్టు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే దిశగా ప్రజలు, కక్షిదారుల వద్దకు న్యాయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని హైకోర్టు జడ్జి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆయన ప్రారంభించారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ లక్ష్మణ్, ఎన్.వి. శ్రావణ్‌కుమార్, ఈ.వి.వేణుగోపాల్, పుల్ల కార్తీక్, శ్రీనివాసరావు లకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ అంబర్ కిషోర్ ఝా పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కోర్టు ప్రారంభోత్సవ సభలో హైకోర్టు జడ్జి లక్ష్మణ్ మాట్లాడుతూ కక్షిదారుల వద్దకు సత్వర న్యాయం అందేందుకు అదనంగా సివిల్ కోర్టులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడి జూనియర్ సివిల్ కోర్టు ఏర్పడడం ప్రజలకు, కక్షిదారులకు ప్రయోజనకరమన్నారు. దీంతో అన్ని వర్గాలకు న్యాయం అందే అవకాశాలు మెరుగుపడుతాయని, న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని తెలిపారు. హైకోర్టులో 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, సుప్రీంకోర్టులో 82 వేల కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కోర్టులు ప్రారంభించుకున్నంత మాత్రాన పెండింగ్ కేసులు పరిష్కారం కావని, జడ్జిలు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు సమిష్టిగా పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. న్యాయవ్యవస్థలో కూడా మార్పు అవసరమని 30 శాతం మహిళా న్యాయవాదులు ఉండాలన్నారు. జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీశైలం తర్వాత చోళుల వంశానికి చెందిన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి గ్రామంలో కోర్టును ప్రారంభించుకున్నామని, గురుతరమైన బాధ్యత జడ్జిలపై, న్యాయవాదులపై ఉందన్నారు. కక్షిదారులకు న్యాయం అందించేందుకు వృత్తి ధర్మాన్ని పాటించాలని, దీంతో సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ, ప్రతి పౌరునికి న్యాయం ప్రాథమిక హక్కు అని, అందుబాటులో ఉండేందుకు కోర్టును ప్రారంభించామన్నారు. అలాగే కోర్టులో 1226 కేసులు పెండింగ్‌లో ఉంటే ఇందులో 419 సివిల్, 807 క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి కోర్టుకు కక్షిదారుడు రావడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయని, బస్సులు, రైళ్ల సౌకర్యం దగ్గరలో రోడ్ల సౌకర్యాలు న్నాయని, అందరికీ అనుకూలమైన కోర్టును ప్రారంభించుకొన్నామన్నారు. సుల్తానాబాద్ కోర్టులో కేసులు అధికంగా ఉండడం వల్ల ఓదెలలో కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైకోర్టు జడ్జిలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మెజిస్ట్రేట్ ధీరజ్ కుమార్, డీసీపీ కరుణాకర్, ఏసీపి గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు దీ కొండ రమేష్, వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోపాల కాలువలు

ధర్మపురి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ధర్మపురి క్షేత్రంలోని నర్మదేశ్వర స్వామి గద్దె ఆధ్వర్యంలో గోపాల కాలువలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నది నుంచి తీసుకు వచ్చిన జలాలతో నర్మదేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రమేష్, సురేష్, రాపాక లక్ష్మీకాంతం, కశొజ్జుల సుధాకర్, ఒజ్జలకృష్ణమూర్తి, దేవిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అన్నపూజ అనంతరం ఊరేగింపుగా గోదావరి నదికి బయలు దేరారు. దారి పొడవునా మహిళలు బిందెలతో నీరు తీసుకువచ్చి బ్రాహ్మణులపైపోసి వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రాపాక లక్ష్మీకాంతం, ఒజ్జల దేవిప్రసాద్, కశొజ్జుల సుధాకర్, ఒజ్జల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోపాల కాలువలు నిర్వహిస్తున్న అర్చకులు

నాంపల్లి గుట్టను సందర్శించిన ఈవో రాధాబాయి

- కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం, అధిక ధరలపై ఆరా
- ఈవో గుట్టపైకి వస్తున్నట్లు ముందే సమాచారం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నాంపల్లి గుట్టపైన కాళీయమర్ధనంలో కొబ్బరికాయలను పరిశీలిస్తున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి గుట్టను ఈవో రాధాబాయి ఆదివారం సందర్శించారు. ఈనెల 11వ తేది శుక్రవారం 'లక్ష్మీనృసింహస్వామి భక్తుల నిలువు దోపిడి' పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నాంపల్లి గుట్టపైకి వచ్చిన ఈవో ముందుగా నాంపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఈవోకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించారు. అనంతరం ఆలయ గోపురం వద్దగల పరిసరాలను పరిశీలించారు. సమీపంలో కనిపించిన చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించారు. గుట్టపైన, మధ్యభాగంలోని, కాళీయ మర్ధనంలోని టెంకాయల విక్రయదారులను ఎంత ధరకు విక్రయిస్తున్నారని అడిగారు. కాళీయమర్ధనంలో పాలు, నూనె, దీపాల ధరలను తెలుసుకున్నారు. టెంకాయలను ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారో భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేయవద్దని, భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మెదలాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాంపల్లి గుట్టపైకి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు, పాలు, నూనే, దీపాల ధరలు తెలిసేలా ధరలు, పరిమాణంతో సహ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌లు, సంబంధిత అధికారులను ఆదేశించారు.

విలువలతో కూడిన విద్య సోషలిజం ద్వారానే సాధ్యం



పీడీఎస్‌యూ సదస్సులో మాట్లాడుతున్న అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ

భగత్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ, విలువలతో కూడిన విద్య కేవలం సోషలిజం ద్వారానే సాధ్యమని అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణతరగతుల్లో ఆదివారం మాట్లాడారు. విద్యార్థులు, యువత సోషలిస్టు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అశాస్త్రీయ విద్యను అందిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్టుచర్యలను ప్రగతిశీల శక్తులు ఐక్యఉద్యమాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్రమాజీ నాయకుడు కొత్తపల్లి రవి, మాజీ రాష్ట్రఅధ్యక్షుడు ఆవుల అశోక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్ సాయిబోలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నరేందర్, భాస్కర్, ఎర్ర అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శులు సాయి, కర్ర గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటప స్థాపన, వీరభద్ర ఆరాధన తోపాటు పలు పూజలు నిర్వహించారు. అలాగే భద్రకాళి ఆవాహన రాత్రి పది గంటల నుంచి ప్రారంభమై తెల్లవారురుూము వరకు కొనసాగుతుంది. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శివసత్తులు, జోగినిల నృత్యాలతో స్వామి వారికి బోనాలను సమర్పించారు. పెద్దపట్నం నిర్వహించిన అనంతరం సోమవారం తెల్లవారురుూమున అగ్నిగుండాల మహోత్సవాన్ని నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈ ఓ సదయ్య తెలిపారు.



స్వామివారిని అలంకరిస్తున్న అర్చకులు

నిరుపయోగంగా సింగరేణి క్రీడామైదానం

- డంప్‌యార్డ్‌గా మారుతున్న ఖని అంబేద్కర్ క్రీడాప్రాంగణం



ఖని పవర్‌హౌస్‌కాలనీలోని క్రీడామైదానం



క్రీడా మైదానం ముందు వేసిన చెత్తాచెదారం

కోల్‌సిటీటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానం నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తాచెదారంతో డంప్‌యార్డ్‌ను తలపిస్తున్నది. దీంతో క్రీడాకారులకు, వాకర్స్‌కు ఉపయోగకరంగా లేకుండా పోయింది. మైదానం అధ్వానంగా మారడంతో స్థానికకార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులు దూరంగాఉన్న మైదానాలకు వెళ్ళాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సింగరేణిసంస్థ పవర్‌హౌస్ కాలనీలోని కార్మిక, కార్మికకుటుంబాల కోసం మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన ఈ మినీ క్రీడామైదానం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. పలుమార్లు విజ్ఞప్తుల మేరకు సింగరేణిసంస్థ ప్రహరీ ఏర్పాటు చేసి అభివృద్ధిచేసింది. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానంగా నామకరణం చేసింది. దీంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడింది. అయితే కొన్నేళ్ళుగా క్రీడామైదానం నిరాదరణకు గురికావడంతో అధ్వానంగా మారింది. మైదా నానికి ఉన్న మెయిన్‌గేటు పనిచేయడం లేదు. అలాగే శివాలయం వైపు ఉన్న గేటు కింద పూర్తిగా దెబ్బతింది.

బాడ్మింటన్ క్రీడాకారుల శిక్షణ

బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు ఈ మైదానంలోనే శిక్షణ తీసుకునేవారు. ఇక్కడి క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర,జాతీయస్థాయిలో బాల్ బాడ్మింటన్ క్రీడాకారులుగా రాణించారు. ఇప్పటికి బాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నారు. మైదానంలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ఫ్లడ్‌లైట్లు, ఇతరసౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉంటుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. వర్షంపడితే చెరువుగా మారుతుందని చెబుతున్నారు.

- మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పాలపాటి వినోద్, బాల్‌బాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ



క్రీడా మైదానంలో ఎంతో మంది బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. ప్రస్తుతం క్రీడాప్రాంగణం అధ్వానంగా ఉండంతో ఇబ్బందిపడాల్సి వస్తున్నది. ఫ్లడ్‌లైట్లు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే రాత్రి వేళల్లో కూడా శిక్షణకు అనుగుణంగా ఉంటుంది. వర్షం పడితే చెరువుగా మారుతున్నది. క్రీడా మైదానంలో వాకింగ్ అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

యూరియా కోటా పెంపుపై స్పందించని కేంద్రం

(5వ పేజీ తరువాయి)

తెలుస్తున్నది. ఇందులో కమిషనర్ రిజర్వు పూల్ 50వేల టన్నులు ఉండగా దాన్ని కూడా అత్యవసర పరిస్థితుల దృష్ట్యా వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, నిజా మాబాద్ జిల్లాల్లో సీఆర్‌పీ కోటా నుంచి యూరియా విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో యేటా జూలై నెలాఖరు తరువాత ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా జరిగేది. మూడు రోజుల క్రితం వరంగల్‌లో యూరియా కొరత తీవ్రం కావడం, రైతాంగం గొడవకు దిగడంతో ఆర్‌ఎఫ్‌సీ ఎల్ నుంచి అత్యవసరంగా ఒక రేక్‌ను వరంగల్‌కు పంపించారు.

15రోజుల్లో కోటా పెంచకపోతే ఇబ్బందే...

కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 15రోజుల్లో కోటా పెంచి రాష్ట్రానికి సరఫరా చేయకపోతే ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదురుకానున్నాయి. పది రోజుల్లో ఉత్తర తెలంగాణతో పాటు దక్షిణ తెలంగాణాల్లో వరినాట్లు మొదలై యూరియా డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 60నుంచి 80వేల టన్నులు రాష్ట్రా నికి ఈ నెలాఖరు వరకు సరఫరా జరిగితేనే డిమాండ్ తట్టుకునే పరిస్థితి ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి ఆది లాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి ఉంది.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



పాలకుర్తిలో కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్న మనాలిఠాకూర్

పాలకుర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనను ప్రజలకు అందించడంతో పాటు రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ రైతు పొలంలో మహిళ కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర చెల్లించడంతో పాటు ఎరువులు, విత్తనాలు రైతులకు సకాలంలో అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే పనిచేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, పాలకుర్తి గ్రామశాఖ అధ్యక్షుడు మేర్గు అశోక్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సందవేని చందు ఇటీవల గాయపడగా పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమాన్ పూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జూలపల్లి గ్రామంలోని మూర్తి విద్యాలయంలో 2000-01 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులతోపాటు నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. పాతికేళ్ల అనంతరం ఒక్క చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా నాటి జ్ఞాపకాలతోపాటు, ప్రస్తుతం వారి జీవన స్థితిగతులను పంచుకున్నారు.

పద్మశాలి గ్రామ సంఘం ఏకగ్రీవ ఎన్నిక



సన్మానిస్తున్న సభ్యులు

ఎలిగేడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి ఎలిగేడు గ్రామ సంఘ ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు. మండల అధ్యక్షుడు మామిడాల రమేష్ అధ్యక్షతన జరగగా, గ్రామశాఖ అధ్యక్షుడిగా కోడూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గ్యాజంగి నాగరాజు, యువజన అధ్యక్షుడిగా గుండేటి మురళి, ప్రధాన కార్యదర్శిగా వంగ సాగర్‌లను ఎన్నుకున్నారు. మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, బూర్ల వెంకట సత్యం, భూపతి, కట్ల సత్యం, వెంగల్‌దాసు రాజమౌళి, భాస్కర్, బూర్ల రాజేశం, గుండేటి తిరుపతి, వీరేశం, సుంక శ్రీధర్, కోడూరి శ్రీనివాస్, కైలాసం పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ పథకాల అమలులో జాప్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కైలాసం

పెద్దపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరడం లేదని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి సహాయ కార్మిక అధికారి తీరు వల్ల కార్మికులకు ప్రమాద, సాధారణ మరణ ప్రయోజనం, పెళ్లి కానుక, ప్రసూతి ప్రయోజనం వంటివి అందడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయినా, మంథని, గోదావరిఖని ఏఎల్‌ఓలు తిరిగి ప్రారంభించి పెండింగ్ వివరాలను బోర్డుకు పంపగా, పెద్దపల్లి ఏఎల్‌ఓ హేమలత నిర్లక్ష్యం వహించారని కైలాసం పేర్కొన్నారు. లేబర్ కార్డుల జారీ, ఇతర పథకాల అమలులోనూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రశ్నించే వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి ఏఎల్‌ఓను బదిలీ చేయాలని కైలాసం డిమాండ్ చేశారు. సమావేశంలో కండే కరుణాకర్,రాజారామ్ లు పాల్గొన్నారు.

నేత్రదానం

పాలకుర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కన్నాల బోడగుట్టపల్లెకు చెందిన పుప్పాల నారాయణ(82) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు రావడం హర్షణీయమని ఫౌండేషన్ మండల అధ్యక్షుడు బీమనపల్లి పృథ్వీరాజ్ అన్నారు. ఎల్విప్రసాద్ టెక్నీషన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో సేకరించి హైదారబాద్‌కు పంపించారు. భార్య మధునమ్మ, కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు

ఊరూరా బోనాల జాతర

కోల్‌సిటీటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రజకుల కులదైవమైన మడేలేశ్వరస్వామి బోనాల ఉత్సవం ఆదివారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం కార్పొరేషన్ ఏరియా ప్రధానకార్యదర్శి మామిడి సతీష్, నడిగట్టు పోషం ఆధ్వర్యంలో ఐబీకాలనీ సమీపంలోని బోనాల ఉత్సవం జరిగింది. గాంధీనగర్, బాపూజీనగర్, సీఎస్‌పీ కాలనీ, ఐబీకాలనీల నుంచి రజక కులస్తులు పెద్దఎత్తున బోనాల నెత్తిన ఎత్తుకొని స్వామికి మొక్కులు చెల్లించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, ఖని రజక సంఘం అధ్యక్షుడు పైడిపల్లి తిరుపతి, 6వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగ్గంపల్లి శ్రీనివాస్, బేబీ శ్రీనివాస్ బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఇజ్జగిరి కొమురవ్వ, వెదరే కొండయ్య, జనగామ సాయిలు, జాలిగా ఐలయ్య, గూడెం రాంచందర్, పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఆషాడమాసం పురస్కరించుకొని పెద్దమ్మను బోనాలతో భక్తి శ్రద్దలతో పూజిస్తారు. అందులో భాగంగా పెద్దసంఖ్యలో మహిళలు, పురుషులు, పిల్లలు పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు అట్టెం రాజు, సుంకరి జగదీష్, రాజు, మాజీ కౌన్సిలర్ కాయితీ సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ పోలు రజిత, గుండా రాజు, సబ్బని సమ్మయ్య, పోలు కనకరాజు, నరేండ్ల కిరణ్, రామ్, లక్ష్మణ్, మూగ శ్రీకాంత్ పాల్గొన్నారు.

గౌడ కులస్తుల ఆధ్వర్యంలో



మడేలేశ్వర స్వామి గుడి వద్ద పూజలు చేస్తున్న రజకులు, పోచమ్మ గుడి వద్ద పూజ చేస్తున్న మనాలి ఠాకూర్

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గౌడ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు జరిగాయి. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆషాఢ మాసం కావడంతో ఆయా కులాల వారు వారి వారి కుల దైవాలను, గ్రామ దేవతలను ఆరాధిస్తూ బోనాలు నైవేద్యంగా సమర్పిస్తారు. పోచమ్మ తల్లికి బెల్లంశాఖ, బోనం నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రోడ్డు మైసమ్మకు మొక్కులు

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుట్టపల్లి గ్రామంలో కరీంనగర్- రాయపట్నం జాతీయ రహదారిపై ఇటీవల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వివిధ ప్రమాదాల్లో కొందరు మరణించగా మరి కొందరు గాయాల పాలయ్యారు. ఈ నేపథ్యంలో రోడ్డున వెళ్తున్న వాహనదారులను కాపాడాలని గ్రామ యువకులు మైసమ్మకు మొక్కులు చెల్లించారు. మైసమ్మ తల్లి దీవెనలతో గ్రామం నుండి వాహనదారులతో పాటు ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుకున్నామని యువకులు తెలిపారు.

సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి



ధర్మారంలో రోడ్డు మైసమ్మకు మొక్కులు

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. స్థానిక బంగ్లాస్ ఏరియాలో నిర్వహించిన పోచమ్మ బోనాల్లో పాల్గొని బోనాలను సమర్పించారు. ఆమె మాట్లాడుతూ యేటా జరిగే బోనాలు ఐక్యతను చాటి చెబుతాయని, ఉత్సవాలు మన సంస్కృతిని, సమైఖ్యతను, భక్తిని ప్రతిబింబిస్తా యన్నారు. ఆర్‌జీ-1 జీఎం దంపతులు లలిత్‌కుమార్, అనీత, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డితో అధికారులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లో చాకలి ఐలమ్మ విగ్రహం



పెద్దపల్లి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన గొళ్లపల్లి సమీపంలోని ముళ్ల పొదల్లో తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ముళ్లపొదల్లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు నాయకులు గ్రామంలో స్థాపించడం కోసం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తయారు చేయించారు. అలాగే విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కూడా పూర్తి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. నాయకుల మధ్య సమన్వయం లోపం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు విగ్రహాన్ని ఎవరు ఆదరించకుండా పోయారు. దీంతో రోడ్డు పక్కన ముళ్ల పొదల్లో దర్శనమిస్తోంది.

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

పెద్దపల్లి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌లకు కృషి చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చింతపండు మల్లన్న అలియాస్ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాజీ ఎంపీపీ బండారి స్రవంతిశ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడం కోసం ఎమ్మెల్సీ కవిత రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సదస్సులు, ధర్నాలు, దీక్షలు చేపడుతుందన్నారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కించపరిచే విధంగా మాట్లాడినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జాగృతి నాయకులపై భౌతికంగా దాడిచేయడమే కాకుండా కాల్పులు జరుపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు .

19న ఉర్సు ఉత్సవం

మంథని, జూలై 13(ఆంధ్రజ్యోతి): సయ్యద్ మహమ్మద్ బాబా తాజుద్దీన్ రహముతుల్లా అలే నాగ్‌పూర్ 103వ ఉర్సు గంధం మహోత్సవాన్ని పట్టణంలో ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు బాబా తాజుద్దీన్ సేవా సమితి ఫౌండర్ ఎస్ఎం అజార్ అలీ ఖాద్రి బాబా, అధ్యక్షుడు బుద్దర్తి శ్రీనివాస్, కమిటీ సభ్యుడు తెలిపారు. గంధం చాదర్ ఫాతహ, ఉదయం గౌస్పక్ చిల్లా షెరఫ్(పిరిల్ల జెండ) లైన్ గడ్డలో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆదివారం మంథని పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి వ్యతిరేకంగా యువత పోరాడాలి

కళ్యాణ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలని ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లో పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రోజు రోజుకు ప్రైవేట్ ఆసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీ పెరిగిపోయిందని, అక్రమ సంపాదనే ధ్యేయంగా పట్టణాలు, గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్నా అమలు కావడం కాలేదని, ప్రభుత్వాసుపత్రిల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేసి అన్నీ రకాల వైద్య సేవలను అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను నిర్లక్ష్యం చేస్తున్నా రని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు, యువత పెడదారిన పడుతున్నారని, మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి సమాజాన్ని కలుషితం చేస్తున్నా రన్నారు. జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మనోహర్, తిరుపతి, దూలం సతీష్, బాబు, ప్రసాద్, మల్లేషం, అవినాష్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోల లక్ష్మీనారాయణ

కల్వచర్లలో గోరింటాకు వేడుక



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

రామగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతీనగర్‌లో గోరింటాకు వేడుకను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం ఫౌండర్ రేండ్ల శారద కుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్కృతిలో ప్రతీ పండుగ ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుందని శారద పేర్కొన్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఒకరికి ఒకరు అరచేతికి గోరింటాకు పెట్టి వేడుకను చేపట్టారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుండి పడి గీత కార్మికుడికి గాయాలు

ఎలిగేడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గర్రం శ్రీనివాస్ గౌడ్ ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన తోటి కార్మికులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్ కాలు తొంటి విరగడంతోపాటు తల, ఛాతిలో తీవ్ర గాయాలయ్యాయి. సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్, పల్లె వీరయ్య ప్రభుత్వ పరంగా బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి

కరీంనగర్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకువస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా చట్టం అమలు చేయడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొడపంగి నాగరాజు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు కెంసారం రవితేజ, సహాయ కార్యదర్శి అరవింద్, నాయకులు అస్లాం, రాకేష్, అజయ్, బాబు, శ్రీనివాస్, నవీన్, సాయి కుమార్, అయాన్ పాల్గొన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన



నారుమడులపై సలహాలు సూచనలు ఇస్తున్న అధికారులు

ముత్తారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముత్తారం మండలంలోనే సగటు వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. వరి నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇటీవల మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారి అనూష అన్నారు. అధిక వర్షాలతో పొలాల్లో నిలిచిన నీటివల్ల వరి పంటలకు తెగుళ్ళ, వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉందని సూచించారు. ప్రభుత్వం మంజూరుచేసిన సర్టిఫైడ్ విత్తనాలే వాడాలన్నారు. స్థానికంగా ఎక్కువగా సాగుచేసే బీపీటీ5204, ఆర్ఎన్ఆర్ 15048 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

నిల్వ నీరు వల్ల చెదురు వ్యాధులు త్వరగా వ్యాపించే అవకాశ ముంటుందని తెలిపారు. తేమ ఎక్కువగా ఉండే రోజుల్లో ఆముదపు కురుపు, తేనెటీగ తెగులు వంటి వ్యాధుల ప్రభావం పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. చార్లిచాటు చేసేటప్పుడు పట్ట తెగులు లేదా ఆకులమచ్చలు కనపడితే వెంటనే సంప్రదించాలని తెలిపారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద పంట బీమా చేయించుకోవాలని సూచించారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వరి దిగుబడిలో వృద్ధి సాధ్యమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

శ్మశాన వాటికలో వసతులు కరువు



సుల్తానాబాద్ పట్టణంలోని శ్మశాన వాటిక



అసంపూర్తిగా ఉన్న గదులు



అసౌకర్యంగా స్నానాల గదులు

సుల్తానాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శ్మశాన వాటికలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కోటిన్నర రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసి శ్మశాన వాటికను నందనవనంగా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టారు. కానీ ప్రణాళికబద్ధంగా పనులు జరగలేదు. కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చే పనులు మాత్రమే చేసి వదిలేశారు. సీసీ రోడ్డు నిర్మించారు. బాధితులు ఉండడానికి వసతి గదుల నిర్మాణాలు నాణ్యతా లోపంతో ఉన్నాయి. పట్టణంలో అంతిమ సంస్కార కార్యక్రమం నిర్వహించడానికి ప్రజలు అగచాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

పట్టణంలో నలభై వేలకు పైగా జనాబా ఉంది. చనిపోయాడనే బాధలో కుటుంబ సభ్యులు ఉంటే అంతిమ సంస్కారం నిర్వహించడం ఆ కుటుంబానికి పెద్ద సమస్యగా మారింది. దశ దిన కర్మ వరకు శ్మశాన వాటికలో పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. బాధిత కుటుంబ సభ్యులు సమస్యలతో సతమతమవుతున్నారు.

● స్నానాలకు ఇబ్బందే

దహన సంస్కారాల అనంతరం అక్కడే స్నానాలు చేయడం ఆనవాయితీ. శ్మశాన వాటికలో స్నానాలు చేయడానికి సరైన వసతి సౌకర్యాలు లేవు. మున్సిపాలిటీ వారికి సమాచారం ఇస్తే సిబ్బంది నల్లాలు వచ్చే విధంగా చూస్తారు. స్నానాలు చేసే స్థలం అపరిశుభ్రంగా ఉంటుంది.

● కోట్లు మంజూరు... అసంపూర్తి పనులు

పట్టణ శ్మశాన వాటిక అభివృద్ధికి కోటిన్నరకు పైగా గత ప్రభుత్వం మంజూరు చేసింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం శ్మశాన వాటికను ఒక నందన వనంలా తీర్చిదిద్దాలని భావించింది. పనులను అసంపూర్తిగా వదిలేశారు. సొంత ఇల్లు లేని వారు శ్మశాన వాటికలో కొన్ని రోజులు ఉండేలా వసతి సౌకర్యాలను ఇక్కడ కల్పించలేదు. దాంతో స్వంత ఇండ్లు లేని వారిలో ఎవరైనా చనిపోతే అద్దె ఇంటిలోకి మృతదేహం తీసుకురావడానికి ఎవరూ అనుమతించడం లేదు. శ్మశాన వాటికలో వసతి లేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.